

# గోపాలం ప్రేమగోల

- ఓ. రాజేంద్రప్రసాద్.



"అమ్మలూ, బామ్మలూ చూసిన పెళ్ళి సంబంధం చస్తే చేసుకోకూడదు. పెళ్ళి చూపుల కెళ్ళడమంటే నాకు మా చెడ్డ చిరాకు. ఎక్కడ లేని మేకప్ చేసుకొని, ఎ కారో అద్దెకు తీసుకొని పదిమంది వంధిమాగధులు వెంట రాగా, వా ళ్ళింటి కెళ్ళాలి. అక్కడ వా ళ్ళిచ్చే స్వీట్లనే గడ్డి తింటూ బితుకు బితుకుమంటూ కూర్చోవాలి.

"ఇంతలో పెళ్ళి కూతురనే అమ్మాయి ముఖాని కింత మేకప్ వేసుకొని, పెద్ద పూలజడ కట్టుకుని, నలుగు రమ్మలక్కలు వెంట రాగా అక్క డుండే కుర్చీ మీదో, చాప మీదో బోలెడంత 'సిగ్గు ఒలకబోస్తూ వచ్చి కూర్చుంటుంది. ఇప్పుడు ఒక ర్నొకరు చూసుకోవాలి. పెళ్ళి కొడుకనే మనం ఆ అమ్మాయి వైపు చూడాలి.

చుట్టుపక్క లున్నవారు మరేం పన్లేనట్టు కిస్సు కిస్సుమని వాళ్ళలో వాళ్ళే నవ్వేసుకుంటుంటారు. ఇంతలో మనవైపు నుంచి ఏ అమ్మో, బామ్మో "ఏమ్మా నీకు పాట లొచ్చా, డ్యాన్సొచ్చా, నడకొచ్చా. తిండొచ్చా" అని డొంక తిరుగుడు ప్రశ్న లన్నీ వేస్తుంది. దానికామ్మా యేం సమాధానం చెప్పదు కాని, పక్క నున్నవాళ్ళే "ఆ, వచ్చండీ", మా అమ్మాయని చెప్పుకోవడం కాదు గాని, సుగుణాల రాశండి" అంటారు. ఇంతలో మన వైపునుంచి 'ఏరా అబ్బాయ్ చూశావా' అంటారు. [ఇ దేదో కొట్లో షావుకారు సరకు నాణ్యత చెప్పినట్లు, మనం దాన్ని పరిశీలిస్తున్నట్టు లేదుటండీ? వాటె హెల్ ఇటీజ్]

"అలా ఆడపిల్లలా సిగ్గు పడతా వేంట్రా?" అంటారు. దానికి ఇందాకట్నించి, కిస్సు కిస్సు మంటున్న వాళ్ళు ఇప్పుడు డొక్క లెగరేసుకొని మరీ కిస్సుకూ, కిస్సుకూ మంటూ నవ్వేస్తారు. అదేదో పెద్ద జో కయినట్టు. మనం అప్పుడు మొహం కందగడ్డలా చేసుకొని ఆ అమ్మాయి వైపు చూడాలి.

"అప్పుడామ్మాయి కూడా లోలోన నవ్వేసుకుంటుంది. అప్పు డొస్తుంది మన క్కోపం. 'మొగుడు కొట్టాడని కాదు, ఆడబడుచు నవ్విందని ఏడ్చిందట ఓ ఇల్లాలు ఆ సామెత అప్పుడు మనకు వర్తిస్తుంది. అప్పుడు అక్కడ పెళ్ళి కూతురి స్థానంలో మనకి గంగి రెద్దు కన్పిస్తుంది. ఇంటి కొచ్చి మన కా సంబంధం నచ్చలేదని చెప్పేస్తాం.

"ఎందుకురా?" అంటే "అ దంతే" అంటాం. అసలు కారణం చెప్పం. అంతే ఆ సంబంధం అక్కడితో కాన్సిల్ అయిపోతుంది. అమ్మలూ, బామ్మలూ, అమ్మమ్మలూ మరో సంబంధం కోసం వెళ్తారు. అక్కడా ఇదే పరిస్థితి ఎదు రౌతుంది. మళ్ళీ తంతంతా మొదటి కొస్తుంది. మళ్ళీ మనం సంబంధం వద్దనేస్తాం. ఎందు కొచ్చిన బాధలు ఇవన్నీ? చక్కగా మనమే ఒకమ్మాయిని చూసుకొని, మన ఇష్టాలు, కష్టాలు ఆ అమ్మాయికి చెప్పి, ఆ అమ్మాయి అభిరుచులు మనం తెలుసుకొని, ఆ అమ్మాయిని ప్రేమించి, మనం ఆ అమ్మాయి ప్రేమ పొంది చక్కగా పెళ్ళి చేసుకొని, చిలకా గోరింకల్లా కాపురం చేస్తే, అదీ జీవిత మంటే. జీవితంలో మాధుర్యం అప్పుడే తెలుస్తుంది. పె ళ్ళంటూ చేసుకుంటే ప్రేమించే చేసుకోవాలి. చస్తే అమ్మలూ, బామ్మలూ చూసిన సంబంధం చేసుకోకూడదు."

పై సు త్తంతా మా గోపాల్రావు గాడి అభిప్రాయాలు వీలున్నప్పుడల్లా నాకు ఇలాగే వాయించేస్తుంటాడు. వినకపోతే వాడితో గొప్ప ఇబ్బంది. నాతో మాట్లాడటం మానేస్తాడు. మా ఇంటికి రావడం మానేస్తాడు. మళ్ళీ నాలు గైదు రోజుల్లో వచ్చి వాడే పలకరిస్తాడు. కానీ ఈ నాలుగు రోజులు మేం బద్ధ శత్రువుల్లా ఉండాలి. అది నాకు నచ్చదు. మే మిద్దరం లాగూల దగ్గర్నుంచి సేంట్ల దాకా కలిసే చదువుకున్నాం. కలిసే పడుకున్నాం. కలిసే తిన్నాం, కలిసే సిగరెట్లు తాగాం. కలిసే ఉద్యోగాలు కూడా చేస్తున్నాం. కాని, కలిసే పెళ్ళి మాత్రం చేసుకోలేకపోయాం. మా బామ్మ చచ్చిపోతూ నాకు పెళ్ళి చేసి మరీ చచ్చింది. 'ప్రేమ, ప్రేమ' అంటూ మా గోపాలంగాడు ఇంతవరకు పెళ్ళి చేసుకోలేదు. అలా అని చేతులు ముడుచుకు కూర్చోలేదు. యథాశక్తి కనబడిన ప్రతీ అమ్మాయినీ ప్రేమిస్తునే ఉన్నాడు. అవి బెడిసి కొడుతూనే ఉన్నాయి.

నాకు పెళ్ళయిన తర్వాత వాడు ఇంకో ఇంట్లోకి మకాం మార్చేశాడు. ఆ ఇంటి కెదు రింట్లో ఓ పెద్ద ఫేమిలీ ఉండేది. ఆ ఇంట్లో అయిదుగురమ్మాయి లుండేవారు. అందరూ మా గొప్పందంగా ఉండేవారు. వారిలో ఎవరిని ప్రేమించాలో తెలియక గొప్ప కన్ఫ్యూజ్ అయిపోతుండేవాడు మా గోపాలం. ఆఫీసు మానేసి మరీ గుమ్మంలో కూర్చొని తెగ బీట్ కొట్టుండేవాడు. అయితే పొరపాటున ఒకమ్మాయి వీడివైపు చూసింది. ఆ క్షణంలో వీడి కామ్మాయి 'రాధ'లా కనిపించింది.

రాధంటే గుర్తు కొచ్చింది మీకు అసలు సంగతి చెప్పడం మరిచిపోయాను. మావాడికి సాహిత్య మంటే కాస్త పిచ్చి ఉండడం చేత 'రాధాగోపాలం' అనే కథలు చదవడం చేత, అందులో గోపాలం తనే అనే ఊహ మా గోపాలానికి రావడం చేత, తప్పకుండా రాధలాంటి పెళ్ళాం తనకు దొరుకుతుందనే ఆశ ఉండడం చేత, ఎవరైనా అందమైన అమ్మాయి కనిపిస్తే చాలు "ఆ... అదిగో రాధ" అంటాడు మా గోపాలం. అంతే, మరింక వెనకా ముందూ ఆలోచించకుండా ఆ అమ్మాయిని ప్రేమించడం మొదలుపెట్టాడు.

ఒక శుభ ముహూర్తం చూసుకుని ఓ లవ్ లెటర్ రాసి పడేశాడు తీయని కలలు కంటూ. అయితే ఆ అమ్మాయి పేరు తెలియదు కనుక 'రాధ' అనే సంబోధించి, ఏవేవో వాడి సాహిత్య తెలివితేట లన్నీ ప్రదర్శించి ఓ ప్రేమలేఖ రాశాడు. ఆ తరువాత ఓ రోజు ఆ అయిదుగు రమ్మాయిలు వీ డింటికి వచ్చారు. మావాడు తెగ ఇదైపోయి వాళ్ళని సాదరంగా లోనికి ఆహ్వానించాడు.

"చూడు బాబూ, మా అయిదుగురిలో రాధనే అమ్మాయి లెవరూ లేరు. ఈ లెటర్ మాలో ఎవరికి రాశావో కొంచెం చెపుతావా?" అని అడిగారు. మావాడు తెగ సంబర పడిపోయి ఎవరికైతే ఉత్తరం రాశాడో ఆ అమ్మాయివైపు చెయ్యి చూపెట్టబోయాడు. కాని అంతలోనే వాళ్ళే మళ్ళీ "మరేం లేదు బాబు, మాలో ఎవరికైతే ఈ ఉత్తరం రాశావో, వాళ్ళాయనతో ఈ సంగతి చెపుదా మనుకుంటున్నాం" అని అన్నారు. అప్పుడు చూశాడు మా గోపాలం వాళ్ళందరి మెడల్లో లైసెన్సు బిళ్ళలు, అంటే మంగళసూత్రాలు. అంతే మావాడి చెయ్యి టక్కున కిందకు దిగిపోయింది. "అబ్బే నే నెవరికీ ఉత్తరం రాయలేదండి, అ దెవరు రాశారో, వెధవ, వెధవన్నర వెధవ, బుద్ధి లేని వెధవ! ఆడపిల్లలు కనిపిస్తే చాలు ఉత్తరాలు రాస్తుంటారు వెధవలు" అంటూ గబగబా నాలుగు ముక్క లనేశాడు.

"మరి కిందన గోపాలం అనే సంతకం ఉంది" అని కోరస్‌గా అరిచా రయిదుగురూ.

వెంటనే నేను కలుగజేసుకుని, ఆ లెటరు చూసి, "అబ్బే ఇది వీడి రైటింగ్ కాదులెండి. వీడి రైటింగ్ ఇంత అందంగా ఉండదు. ఇందులోని సంతకం, మావాడి పేరు ఒకటే కావడం కేవలం మావాడి దురదృష్టం. అనవసరంగా మావాణ్ణి అపార్థం చేసుకుంటున్నారు" అని వాళ్ళకి నచ్చచెప్పి, బ్రతిమాలి వాళ్ళని ఇంటికి పంపేసరికి నా తలప్రాణం తో క్కొచ్చింది.

తరవాత మావాడికి "అసలు వివరాలన్నీ తెలుసుకోకుండా ని న్నెవడు ప్రేమించమన్నాడు? ప్రేమిస్తే ప్రేమించావు, లవ్ లెటర్ ఎవడు రాయమన్నా"డని నాలుగు చీవా ట్లేశాను. అక్కడితో వాడి మొదటి ప్రేమాయణానికి తెర పడింది.

మేం ఆఫీసు కెళ్ళే దార్లోనే వుమెన్స్ కాలేజీ ఉంది. మా వా డక్కడ రోజూ ఓ గంటసేపు అటెండెన్స్ వేయించుకొని వచ్చేస్తుంటాడు. ఒకసారి ఓ అందాల భరిణె మా వాడి కళ్ళలో పడింది అంతే - "ఒరే మీసాలం అదిగోరా రాధ" అన్నాడు. అంటే ఆ అమ్మాయి వాడికి నచ్చిం దన్నమాట.

వాడికి నచ్చితే నచ్చింది గానీ, నాకు ఆ మీసాలంగాడి పేరు పెట్టడం నచ్చలేదు. అయినా ఏం చేస్తాం? వాడి సాహిత్యం పిచ్చి తగలబెట్ట. ఎలా సంపాదించాడో ఆ అమ్మాయి ఫోటో ఒకటి సంపాదించాడు. రోజూ కాలేజీ దగ్గర అటెండెన్స్ వేయించుకునేవాడు. "ఏరా, ఆ అమ్మాయితో మాట్లాడేవా?" అంటే "ఆ ప్రయత్నంలోనే ఉన్నా" అనేవాడు. నెల రోజులైనా అదే సమాధానం చెప్పేవాడు. ఏమైతే అయిందని ఒకరోజు ఆ అమ్మాయికి లెటరు రాశాడు. డైరెక్ట్ ఎటాక్ ఇవ్వడం మావాడికి చాతకాదులెండి ! దానికి వీడి ఫోటో, ఆ అమ్మాయి ఫోటో కూడా పిన్‌చేసి ఆఫీసు కెళ్ళే దార్లో పోస్ట్ చేద్దామని ఫైల్లో పెట్టుకున్నాడు. కాని ఆ రోజు ఆ రాధనే అమ్మాయి కాలేజీకి రాలేదు. దాంతో వీడు నిరాశపడిపోయి ఆ లెటరు పోస్ట్ చెయ్యడం మరిచిపోయాడు. ఆఫీసులో ఫైల్ పడేసి, కాఫీ తాగడానికని కేంటీన్ కెళ్ళాం.

ఇక్కడే వాడి ప్రేమ కథ ఓ మలుపు తిరిగింది. ఈలోగా ఆ ఫైలు ప్యూనుద్వారా మా బాస్ గదిలోనికి చేరింది. మేం తిరిగి వచ్చేసరికి, గోపాలంగాడికి బాస్ గదిలోంచి పిలు పొచ్చింది. ఆ తరువాత గదిలో ఏమైందో నేనైతే వినలేదు గాని, మా గోపాలంగాడే చెప్పాడు. ముందుగా "ఆఫీసు ఫైల్లో లవ్ లెటర్స్ ఏంటోయ్" అని బాస్ అడిగాట్ట, తరువాత ఫోటో చూసి - "ఈ అమ్మాయి ఎవరోయ్" అన్నాట్ట, వీడు పెద్ద పోజుగా "నా ఫియాన్సీ సార్" అన్నాట్ట. "ఓలాగా, వా ళ్ళింట్లో ఒప్పుకున్నారా?" అని అడిగాట్ట బాస్. "లేదు సార్, వాళ్ళు చాలా చాదస్తం మనుషులండి, మా ప్రేమని అంగీకరించేంతటి పెద్దమనుసు వాళ్ళలో లేదండి. వాళ్ళ నాన్న మరీ పాతకాలం మనిషి లాగున్నాడండీ. మీలాంటి పెద్దలు మాకు చేయూతనిస్తే, ప్రేమ వివాహాలు సక్సెస్ అయి, వరకట్నం లాంటి సమస్యలు తగ్గుతాయి కదా సార్. వచ్చే నెల్లోనే మే మిద్దరం రిజిష్టరు మారేజ్ చేసుకుందా మనుకుంటున్నాం సార్ !" అంటూ మావాడు ఏదేదో చెప్పేస్తున్నాడట. అప్పటికే బాస్‌కి బి.పి. రేజ్ అయిపోవడం మావాడు గమనించలేదట. "స్టాప్... స్టాపిట్, ఈ అమ్మా యెవరో నీకు తెలుసా? నా కూతురు" అన్నాట్ట.

దాంతో మావాడు అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయాడు. లేచేసరికి శంకరగిరి మాన్యాలకి ట్రాన్స్‌ఫర్ కాగితాలు మావాడి చేతిలో ఉన్నాయి. అక్కడితో మావాడి రెండో ప్రేమ కథకి ముగింపు.

కొన్నాళ్ళకి ఆ శంకరగిరి మాన్యాల నుంచి గోపాలం నా కో ఉత్తరం రాశాడు. "అక్కడ తన కో రాధ కనబడిం"దని, "ఆ అమ్మాయికి పెళ్ళవలే"దని, "బాస్ కూతురు కూడా కా"దని రాశాడు. వీ డుండే వీధిలోనే ఉందట, మాటా మాటా కలిపేడట, గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చిందట. తల మునకలయ్యే ప్రేమలో ఉన్నాట్ట [వీడి ప్రేమ గోల మండిపోనూ !] "నువ్వు ఒక్కసారి వస్తే బాగుంటుం"దని కూడా రాశాడు.

ఓ శుభ ముహూర్తం చూసుకొని గోపాలం దగ్గర కెళ్ళాను. వా డెంత ప్రేమపిచ్చిలో ఉన్నాడో వాడి వాలకం చూస్తేనే అర్థమైపోయింది. ఆ సాయంత్రమే ఆ అమ్మాయిని పరిచయం చేశాడు.

అమ్మాయైతే బాగుంది కాని, నా కెందుకో ఆమెమీద మంచి అభిప్రాయం కలగలేదు. నెమ్మదిగా ఎంక్వయిరీ ప్రారంభించేను నా ఎంక్వయిరీలో చాలా నిజాలు తెలిశాయి. నా ఊహ కూడా నిజమైంది. ఆ అమ్మాయి వట్టి తిరుగుబోతని, ఎవడి దగ్గర ఒక రూపా యెక్కువుంటే వాడితో తిరుగుతుందని, బ్లాక్ మెయిల్సూ గట్రా చేస్తుందని విన్నాను. వినడమే కాదు నే కళ్ళారా చూశాను. ఈ విషయాలన్నీ గోపాలంగాడితో చెప్పదలచుకోలేదు. చెపితే "ఛస్, ఆ అమ్మాయి అలాంటిది కాదురా, నేనంటే ప్రాణం పెడుతుందిరా, నీ కెవరో మా ప్రేమని చూళ్ళేక లేనిపోనివి చెప్పారు" అంటాడు.

నిజమే. ప్రేమ పిచ్చి అలాంటిది. వా ణ్ణిలా వదిలేస్తే ప్రేమా, ప్రేమా అంటూ పనికిరాకుండా పోతాడు. వా ణ్ణెలాగైనా ఓ ఇంటివాణ్ణి చెయ్యాలి. నేను రంగంలోకి దిగాను.

గోపాలం గురించి ఇన్ని వివరాలు మీతో చెప్పినవాణ్ణి, ఒక్క విషయం మాత్రం ఇంతవరకు చెప్పలేదు. గోపాలంగాడికి స్వయాన ఓ అక్క ఉంది. ఆ అక్కకి ఒకే ఒక కూతు రుంది. పేరు సీత. కుందనాల బొమ్మ, అందచందాల రాశి, సార్థక నామధేయురాలు. గోపాలం మాటల్లోనే చెప్పాలంటే ఇద్దరు రాధలంత అందంగా ఉంటుంది. అంతేకాదు గోపాలం అంటే వల్లమాలిన ప్రేమ. గోపాలంగాడే ప్రేమ, ప్రేమ అంటూ, ఇంట్లో వాళ్ళు అనుకున్న సంబంధం చేసుకోకూడదంటూ, వెధవ పన్లన్నీ చేస్తూ, ఎదురుదెబ్బలు తింటున్నాడు. ఆ మీసాలం అన్నవాడెవడో, ప్రేమికులకి వారధిగా నిలిచాడో లేదో గాని, గోపాలం నా కా పేరు పెట్టినందుకైనా గోపాలాన్ని సీతని కలపాలని ఒక దృఢనిశ్చయానికి వచ్చాను.

గోపాలం ప్రస్తుతం ప్రేమిస్తున్న అమ్మాయిని కలిశాను. మొదట మర్యాదగా చెప్పాను. 'ఎంత డబ్బైనా ఇస్తాను. గోపాలాన్ని వదిలే'య మన్నాను. పెద్ద పతివ్రతలా బెట్టు చూపెట్టింది. సామ, భేద దండోపాయాలన్నీ ప్రయోగించాను. ఆఖరికి లొంగిపోయింది. ఆ ఊరినుంచి పంపేశాను. పంపించేస్తూ ఒక ఉత్తరం కూడా రాయించాను. "నీకూ నాకూ ఏ సంబంధంలేదని, ను వ్వెవరో నాకు తెలియ"దని, ఇలా రాయించా నా ఉత్తరం.

దాంతో గోపాలం పిచ్చెత్తిపోయాడు. "మోసం చేసిం"దని ఏడ్చాడు. "దేశంలో ఆడవాళ్ళంత ఇంతే"నని. ఇదైపోయాడు. శాలువా కప్పేసుకున్నాడు. గడ్డం పెంచేశాడు. "నా జీవితం ఇంతేరా" అని వాపోయాడు.

నేను వాడికి నచ్చచెప్పాను. "అంత మన మంచికే" నన్నాను. "ఆడవాళ్ళంతా ఒకేలా గుండ" రన్నాను. "ఇవన్నీ కృత్రిమమైన ప్రేమలు, నిజమైన ప్రేమ, నిజమైన అందం నీకు కావాలంటే నాతో రా" అని చెప్పి ఆఫీసుకు సెలవు పెట్టించేసి, మా ఊరికి తీసుకుపోయాను. అక్కడ గోపాలం తల్లీ, తండ్రీ, అక్కా, సీతా అందరూ వీడి వాలకం చూసి చాలా గాభరా పడిపోయారు. "గాభరా పడవలసిన పని లే"దనీ, "కాస్త ఒంట్లో బాగాలే"దని చెప్పి, సీతకు మాత్రం అసలు సంగతి చెప్పాను. "నువ్వే ఎలాగైనా వాడిని ఓ దార్లోకి తీసుకురావా"లని చెప్పాను.

"ఎలాగైనా మామయ్యను రక్షించుకుంటా"నని, పాపం మావాడికి అన్ని సపర్యలు చేసింది. రాత్రనక, పగలనక వాడి మంచం దగ్గరే ఉంది. వాడు పిచ్చి పిచ్చిగా కలవరిస్తుంటే దగ్గరుండి ధైర్యం చెప్పింది. జ్వరంతో ఒళ్ళు కాలిపోతుంటే నుదుటిమీద తడిగుడ్డ ఉంచింది. టైముకి మందులు తాగించింది. బట్టలు మార్చింది. వాడు కళ్ళు తెరిస్తే, వాడి ముందు సీతమ్మ తల్లిలా కనిపించింది.

"మామయ్యా ! ఎందు కిలా ప్రేమ ప్రేమ అంటూ మనసు పాడుచేసుకుంటావు? నే న్నీ ప్రేమకు పనికిరానా? నన్ను ప్రేమించలేవా?" అని కన్నీళ్ళు పెట్టుకుని అడిగింది.

మా వాడి కిప్పుడిప్పుడే మంచుతెరలు తొలగిపోతున్నట్లు ఒక్కొక్కటే అర్థమవసాగాయి. అసలైన ప్రేమ అంటే ఏమిటో తెలుస్తోంది. ఒకప్పుడు "సీతను పెళ్ళి చేసుకోరా" అంటే "ఛీ దాన్నా? అ దో పల్లెటూరి మొద్దు, అసలు దానికి ప్రేమించడమే చాతకాదు. దా న్నెవరు చేసుకుంటారు?" అని సీత ముందే నిర్మొహమాటంగా చెప్పేశాడు. అవన్నీ ఇప్పుడు లీలగా గుర్తు కొచ్చాయి గోపాలానికి. అసలైన అందమంటే ఏమిటో ఇప్పుడు వాడికి కనిపిస్తోంది. వాడి కిప్పుడు సీత ముగ్గురు రాధ లంత అందంగా కనిపిస్తోంది.

సీత సపర్యలవల్ల నైతేనేమి, మావాడికి జ్ఞానోదయమవడంవల్ల నైతేనేమి గోపాలం పూర్తిగా కోలుకున్నాడు. మరో మూడు రోజుల్లో లేచి తిరిగాడు. మా అందరి కళ్ళలో ఆనందం తాండవించింది.

ఒక రోజు గోపాలం వాళ్ళమ్మ దగ్గరికి వెళ్ళి - "అమ్మా ! సీతకి చాలా అన్యాయం చేశానే, సీత నన్ను పెళ్ళాడుతుందో, లేదో కనుక్కోవే !" అని అడిగాట్ట.

దానికి వా ళ్ళమ్మ "ఓరి పిచ్చిసన్నాసీ !" అని ఒక నవ్వు నవ్విందట. ఈ నవ్వు నవ్విన నెల్రోజులకి గోపాలం, సీతల పెళ్ళి రంగ రంగ వైభోగంగా జరిగిపోయింది. వాడి ప్రేమ గోలకి తెర పడిపోయింది.

మా వా డిప్పుడు 'కుమార సంభవ' ప్రయత్నంలో మహా బిజీగా ఉన్నాడు, వాణ్ణి డిస్టర్బ్ చెయ్యడం ఇష్టంలేక గోపాలం సెలవును ఇంకా నెల్రోజులు పొడిగించమని, వా ళ్ళాఫీసురుకి లీవ్ లెటర్ పోస్టు చేశాను. ★